క్లుప్తంగా

వైభవంగా జగన్నాథుని రథోత్సవం



కాజులూరులో జగన్నాథుని రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కాజులూరు: మండల కేంద్రం కాజులూరులో శుక్రవారం జగన్నాథుని రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేశంలోనే ఒడిశా రాష్ట్రం పూరిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకొనే జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకుని అదే రోజు మండల కేంద్రమైన కాజులూరులో రథయాత్ర నిర్వహించటం పరిపాటి. వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు రాకుదుటి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయం నుంచి గ్రామ పురవీధుల మీదుగా రథయాత్ర సాగింది. గ్రామ పెద్దలు సహాయ సహకారాలతో పలువురు కోలాటం బృందాలు నృత్యాలు చేయగా, పరిసర గ్రామాలకు చెందిన పలువురు భజన బృందాలు భక్తి గీతాలు ఆలపిస్తూ రథోత్సవాన్ని అనుసరించారు. మండల పరిసరాల్లోని కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన పలు గ్రామాల భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 30న మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన ఉదయం 11.గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 16 అంశాలతో కూడిన అజెండాపై కౌన్సిలర్లు చర్చించనున్నట్టు కమిషనర్ తెలిపారు. కావున సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ



గంగవరంలో సామాజిక తనిఖీ వేదికలో పనుల వివరాలు పరిశీలిస్తున్న పీడీ

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంజీఎన్ఆర్‌జీఎస్, పంచాయతీరాజ్ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డ్వామా పీడీ మధుసూదనరావు పనుల ఆడిట్‌ను పర్యవేక్షించారు. 2024–25లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 1033 పనులక గాను రూ.8.39 కోట్ల వేతనాలు, రూ.83.57 లక్షల మెటీరియల్, రూ.3.61 కోట్ల పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి చేపట్టిన పనులను సామాజిక తనిఖీ చేశారు. తనిఖీలో వెల్లడైన పొరబాట్లకు సంబంధించిన విలువను క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ ఎ.సత్యనారాయణ, స్టేట్ టెక్నికల్ మేనేజర్ కె.సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోలర్ ఎం.బాలాజీ, అంబుడ్స్‌మన్ అడపా వెంకట శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్‌రావు, ఎంపీపీ పంపన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



కోటిపల్లిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

కె.గంగవరం: ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్‌కేవీఎం స్టూడెంట్ కిట్స్ జిల్లా పంపిణీ పరిశీలకులు అబ్దుల్ ఘని అన్నారు. మండలంలోని కోటిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వారి చేతుల మీదుగా విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు అందజేశారు.

స్టాక్ పాయింట్ల పరిశీలన

రామచంద్రపురం: పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ స్కూల్‌లోని విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌లను శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల రాష్ట్ర పరిశీలకుడు షేక్ అబ్దుల్ ఘని, సర్వశిక్షాభియాన్ సీఎంఓ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. స్టాక్ పాయింట్లో ఉన్న యూనిఫాం, షూస్ మెటీరియల్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వీర్రెడ్డి, నాగేశ్వరి, హెచ్ఎం విత్తనాల సుబ్బారావు సీఆర్ఎంటీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

అప్పుడు ఒక రూల్.. ఇప్పుడు ఒక రూల్

- ఇష్టారాజ్యంగా కేటాయింపులు
- కూటమి నేతల తీరుపై విమర్శలు
- నేడు కౌన్సిల్ సమావేశం



నిర్మాణాలు చేసే 23వ వార్డు చెరువుగట్టు వీధిలోని పురపాలక సంఘ ఖాళీ స్థలం

రామచంద్రపురం: అధికార కూటమి పార్టీ నేతలు నిధులు వినియోగంలో ఒక రూల్ అయితే వైఎస్సార్ సీపీ నాయకుల నిధుల వినియోగంలో మరో రూల్‌ను పాటిస్తున్న తీరును పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొస్తున్న కూటమి నేతల మాటలు కోటలు దాటుతున్నా వాటి అమల్లో, నిధుల వినియోగంలో మాత్రం ఆచరణ సాధ్యం కావడం లేదు. తాజాగా మున్సిపాలిటీ నిధుల కేటాయింపులో జరుగుతున్న పక్షపాత తీరు దీనిని నిదర్శనంగా నిలుస్తుంది. నేడు జరిగే మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశానికి తీసుకువచ్చే అజెండాను పరిశీలిస్తే విషయం అర్థమవుతుంది. ఎజెండాలోని ఒకటో అంశంగా 23వ వార్డు చెరువు గట్టు వీధి పురపాలక సంఘం ఖాళీ స్థలంలో నెట్ క్రికెట్, ఓపెన్‌జిమ్, స్టేజ్, పిరమిడ్ ధ్యానకేంద్రం, చిన్న తరహా వ్యాపారస్తులు, మహిళా స్వయం సహాయక సంఘాల వారు వ్యాపారం చేసుకునేందుకు షెడ్‌ల నిర్మాణానికి సంబంధించి స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు సీఎస్ఆర్ నిధులు రూ.1.50 కోట్ల అంచనాలు తయారు చేసి కౌన్సిల్ ఆమోదం కోసం పెట్టారు. గతంలో ఇదే స్థలంలో పడమర వైపున వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారుగా రూ.కోటితో రైతుబజార్‌ను నిర్మించారు. మరో పక్క ప్రజల సౌకర్యార్థం తూర్పు వైపున కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ నిధులు రూ.2 కోట్లు కేటాయించి కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు అంచనాలు కూడా తయారు చేయించారు. అయితే గతంలో ఇదే సర్వే నంబర్‌లో చెరువు ఉండటంతో ఇందులో ఎటువంటి భవనాలు నిర్మించరాదని కల్యాణ మండప నిర్మాణానికి అధికార పార్టీ నేతలు కొర్రీలు వేయటంలో మున్సిపల్ కమిషనర్ ఈ సర్వే నంబర్‌లో స్థలాన్ని డీ నోటిఫై చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. అయితే ఇదే స్థలంలో రైతు బజార్‌ను అనుకుని ఖాళీ స్థలంలో నెట్ క్రికెట్, ఓపెన్‌జిమ్, స్టేజ్, పిరమిడ్ ధ్యానకేంద్రం, చిన్న తరహా వ్యాపారస్తులు మహిళా స్వయం సహాయక సంఘాల వారు వ్యాపారం చేసుకునేందుకు షెడ్‌ల నిర్మాణానికి సంబంధించి గత నెల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాగా చేర్చారు. అయితే గత నెల సమావేశంలో కౌన్సిలర్లు ఈ అంశాన్ని వాయిదా వేయగా తిరిగి తాజాగా నేడు జరిగే కౌన్సిల్ సమావేశానికి మరోసారి ఈ అంశాన్ని తీసుకురావడం వివాదాస్పదంగా మారింది. గతంలో భవన నిర్మాణాలు చేయకూడదని డీనోటిఫై చేయాలనే స్థలంలోనే ఈవిధంగా తిరిగి నిర్మాణాలు ఎలా చేస్తారని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. అసలు మున్సిపాలిటీ సర్వే నంబర్ స్థలం ఎఫ్ఎంబీలో ఖాళీ స్థలంగా ఉందా.. లేక చెరువుగా ఉందా అనేది స్పష్టత లేదు. ఒక వేళ ఎఫ్ఎంబీలో చెరువుగా ఉంటే ఎట్టి పరిస్థితిల్లోనూ నిర్మాణాలు చేయరాదంటున్నారు. కలెక్టర్ డీనోటిఫై చేసిన తరువాతే చేయాల్సి ఉంటుందనేది పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా తాజాగా జరుగుతున్న సమావేశంలో తిరిగి ఈ నిర్మాణాలకు నిధులు కేటాయించటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీరా నిధులు వినియోగం తరువాత బిల్లులు రావనే అనుమానాలను సైతం కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఖాళీ స్థలంపై ఇన్ని అనుమానాలు వారే వ్యక్తం చేసి నేడు ఇలా కూటమి నేతలకు అనుకూలంగా నిర్మాణాలు చేయాలనుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేడు జరిగే కౌన్సిల్ సమావేశంలో ఏం జరుగుతుందో చూడాల్సిందే.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం: వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో గోదావరి వరదల పట్ల ప్రభుత్వ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులను తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎస్సై హరీష్ కుమార్ ఆదేశించారు. వరద ప్రభావాలపై చర్చించేందుకు శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 25న కలెక్టర్ మహేష్ కుమార్ వరదల నేపథ్యంలో ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారన్నారు. కలెక్టర్ సూచలను వివరించారు. గతంలో సంభవించిన వరద పరిస్థితులను సమీక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వైద్య, ఆరోగ్యం, విద్య, పశు సంవర్థక శాఖ, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు హాజరయ్యారు.

యువత కీలకపాత్ర పోషించాలి



గొల్లపాలెంలో యువజన విభాగ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

కాజులూరు: యువజన సంఘాల ద్వారా యువత పార్టీని పరుగులు పెట్టించాలని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మాదిరెడ్డి పృథ్వీరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించడంతో అన్ని వర్గాలు నష్టపోతున్నారని ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు ఎక్కువ అన్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీకి యువత అండగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల యువజన విభాగాల అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, ఉపాధ్యక్షుడు నిమ్మితి విజయ్, పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, పోతు శ్రీనివాసు, జొన్నకూటి వెంకటేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

కె.గంగవరం: ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ స్థాయి నుంచి తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరం బీసీ కమ్యూనిటి హాల్ వద్ద మండల యువజన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీలోని అన్ని కమిటీల నియమకం జరుగుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తరువాత గ్రామస్థాయిలో కమిటీల నియామకం పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. ప్రస్తుతం అన్ని వర్గాలలో కూటమి ప్రభుత్వం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉన్నాయని ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి ఎన్నికల్లో గెలిచి మాట మార్చడం దారుణమన్నారు. దీనిపై అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని వారికి అండా వైఎస్సార్ సీపీ ఉందని తెలియజేయాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు పెట్టా శ్రీనివాస్, పంపన సుబ్బారావు, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, నియోజవకర్గ యువజన ఇన్చార్జ్ మాదిరెడ్డి పృథ్వీరాజ్, మండల విభజన అధ్యక్షులు మధు, పెంకే వెంకటరమణ, మేడిశెట్టి గోవిందరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన శుక్రవారం వాడీవేడిగా జరిగింది. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.రాహుల్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టులు మండలంలో 68కి గాను 18 పోట్ల పూర్తయ్యాయన్నారు. మరో 49 నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి కావడానికి ఎన్ని సంవత్సరాలు పడతాయని ప్రశ్నించారు. దీనికి ఏఈ సమాధానం ఇస్తూ కాంట్రాక్టర్‌కి బిల్లులు రాక పోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీ షా(బాబ్జీ) మాట్లాడుతూ ద్రాక్షారామలో జల్‌జీవన్ మిషన్ పనుల పేరు చెప్పి చాలా ప్రాంతాల్లో రోడ్లు పాడు చేశారని, వాటిని తిరిగి నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయా అని ప్రశ్నించడంతో తప్పకుండా నిర్మిస్తామని ఏఈ సమాధానం చెప్పారు. జగన్నాయకులపాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామానికి జల్‌జీవన్ మిషన్ పథకం ఎందుకు వర్తింపజేయలేదని అడగ్గా మలివిడతలో పెడతామని ఏఈ సమాధానం చెప్పారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ ముందుగా ఎస్సీ కాలనీల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా జల్‌జీవన్ మిషన్ పనులు చేస్తున్న కాంట్రాక్టరు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించి వారి ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా కాంట్రాక్టర్‌కు సూచించాలని ఏఈని బోస్ ఆదేశించారు. హౌసింగ్ డీఈ సుంకర రాంబాబు మాట్లాడుతూ పీఎంఏవై 2.౦ లో 727 దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు 2,50,000 మంజూరు చేయడం జరుగుతుందన్నారు. భీమక్రోసుపాలెం సర్పంచ్ పలివెల లోవరాజు మాట్లాడుతూ తమ గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఒక్క ఇళ్లు కూడా హౌసింగ్ లోను మంజూరు కాలేదన్నారు. అలా పలు గ్రామాల సర్పంచ్‌లు పలు సమస్యలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ సెలత్ రాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ఆక్రమణల తొలగింపు



టేకిలో డ్రైనేజీపై ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

- ఆధారం కోల్పోయిన సామాన్యులు
- ఆదుకోవాలని బాధితుల ఆవేదన

కపిలేశ్వరపురం: మాచర నీటిసంఘం పరిధి టేకి గ్రామంలోని గుబ్రప్పా, రేగిగుంట మైనర్ డ్రెయిన్ల పూడిక తీత పనులకు అడ్డుగా ఉన్నాయన్న నేపంతో ప్రభుత్వ శాఖల అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం డ్రైనేజీ వెంబడి ఉన్న నిరుపేదల నివాసాలు, బడ్డీ దుకాణాల ఆక్రమణలను తొలగించారు. డ్రైనేజీ వెంబడి దుకాణాలు, నివాసాలు, పాకలు ఉన్నాయి. వారందరికీ ఆక్రమణలను తొలగించాలంటూ నోటీసులు ఇచ్చి జేసీబీ యంత్ర సాయంతో తొలగింపు కార్యాచరణను ప్రారంభించారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి తమను ఖాళీ చేయమంటే ఎక్కడికెళ్లాలో తెలీని దిక్కు తోచని స్థితిలో ఉన్నామంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా డ్రైనేజీ గట్టుపై నివాసముంటున్నామని ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేయమనడంతో యాతన పడుతున్నామని బాధితులు వాపోయారు.

300 ఎకరాల ముంపు సమస్యకు పరిష్కారం

టేకి గ్రామంలో డ్రెయిన్ వెంబడి 300 మీటర్లు మేర ఆక్రమణలున్నాయని, కాలువను వెడల్పు చేసే ప్రతిపాదన ఉందని, ప్రస్తుతం పూడిక తీత పనులను ప్రారంభించామని పనులకు అడ్డుగా ఉన్నందున ఆక్రమణలను తొలగించేందుకు నిర్ణయించామని డ్రెయిన్స్ ఏఈ పి.వీరబాబు విలేకరులతో అన్నారు. రెండు కిలోమీటర్లు మేర ఉన్న డ్రెయిన్ పరిధిలో 300 ఎకరాలు ఏటా ముంపుబారిన పడుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలంటూ ఏళ్ల తరబడి రైతులు అనేక సార్లు అర్జీలిచ్చారని, కాలువను వెడల్పు చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించిన నేపథ్యంలో ఆక్రమణలను తొలిగించక తప్పని పరిస్థితి నెలకొందని తమకు సహకరించాలన్నారు.

నోయిడాలో జెడ్పీ పాఠశాల టీచర్ ప్రసంగం



నోయిడాలో నిర్వాహకులతో ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వాసంశెట్టి శ్రీనివాసరావు నోయిడాలోని విశిష్ట వేదికపై విద్యా నైపుణ్యాలపై ప్రసంగం చేశారు. థింక్ న్యూడ్జ్ అండ్ మూవ్ డిపార్ట్‌మెంట్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ కార్యాలయం వద్ద ఈ నెల 24, 25 లలో జాతీయ స్థాయి విద్యా, వైజ్ఞానిక నైపుణ్యాల వృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండురోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధిగా శ్రీనివాసరావు హాజరయ్యారు. పిల్లల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారన్నారు. తాను పనిచేస్తున్న వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాబోధన, ప్రయోగాత్మక అవగాహనా కార్యక్రమాలను శిక్షణా తరగతి వేదికపై వివరించానన్నారు. నిర్వాహకులు డా.ఎస్ సూర్యకళ్యాణి, చిత్రా గుప్తా చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఏడీఏగా నాగకుమార్ బాధ్యతల స్వీకరణ



నాగకుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఏఓ మణిదీప్, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఏడీఏగా బి.నాగకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా చింతలపూడి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా రామచంద్రపురం వచ్చారు. ఆయనకు రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టిన ఉపాధ్యాయులు

రాయవరం: మండలంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూలై 12వ తేది వరకు ఈ డ్రైవ్ నిర్వహించాల్సి ఉంది. మండలంలో శుక్రవారం నాటికి 141 మంది పాఠశాలల్లో చేరినట్లు మండల విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు. ప్రతి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి బడి ఈడు చిన్నారులను బడిలో చేర్పించాలని ఎంఈవో రామలక్ష్మణమూర్తి సూచించారు. వచ్చే నెల 12వ తేది నాటికి లక్ష్యం మేరకు ఎన్‌రోల్‌మెంట్ చేయాల్సి ఉండగా, ఉపాధ్యాయులు ఇంటి బాట పట్టారు.

ఎరువులతో ఏదీ ఆరోగ్య రక్షణ..?

- ఆరోగ్యంపై ప్రభావం
- సేంద్రియానికి రైతన్న ప్రాధాన్యం
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు



గొల్లపాలెంలో ట్రాక్టర్‌తో పశువుల పెంట తరలిస్తున్న రైతులు



మొగలిపాలెంలో ఎడ్లబండిపై తెచ్చి పొలంలో వెదజల్లుతున్న రైతు

కాజులూరు: గోఆధారిత, సేంద్రియ ఎరువులతో సాగు చేసే పంటలు ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని ప్రకృతి వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయ సేద్యంలో రసాయన ఎరువుల వాడకం రోజురోజుకీ పెరిగిపోతుంది. ఒకప్పుడు కేవలం సేంద్రియ ఎరువులనే వినియోగించి పంటలు సాగుచేసే రైతన్నలు క్రమేపీ అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులను వినియోగించడం ప్రారంభించారు. తెగుళ్ల పలు రకాల పురుగుల నివారణతో పాటు పంట ధృడంగా పెరగటానికి, చివరకు కలుపు మొక్కల నిర్మూలనకు కూడా రసాయన మందులనే వినియోగిస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో పాఠకులు అర్థం చేసుకోవచ్చు.

పంటలు విషతుల్యం..


రసాయన ఎరువుల వినియోగంతో క్రమేపీ భూసారం దెబ్బతినడమే కాకుండా పంట ఉత్పత్తులు విషతుల్యమై వాటిని ఆహారంగా తీసుకునే ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని నిపుణులు అంటున్నారు. ఈ క్రమంలో తాము పండిస్తున్న ఆహారం కలుషితమవ్వకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గ గ్రామాలలోని కొందరు రైతులు ఇటీవల సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి పెడుతున్నారు. పశువుల శాలలోని పేడ, చీకినగడ్డి ట్రాక్టర్లు, ఎడ్లబండిపై తెచ్చి పొలాల్లో వేస్తున్నారు. సొంతంగా పశువులు లేని రైతులు కోళ్ల ఫారాల్లోని కోడిపెంట, చెరువులు, కుంటల్లోని పూడికమట్టిని కొనుగోలు చేసుకుని మరీ పొలాల్లో వేస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన అనేక మంది రైతులు సేంద్రియ సాగుకు సన్నద్ధమవుతున్నారు. అన్ని గ్రామాల్లోనూ దాళ్వా మాసూళ్ల దాదాపు పూర్తయ్యాయి. పంటకాలువల ద్వారా నీరు సమృద్ధిగా విడుదలై అవి పొలాలకు చేరితే పంటదమ్ములు చేసేసి తొలకరి సాగు ప్రారంభించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పంట దమ్ములకు మందే ఈ సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియదున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి మంచి ఫలితాలను ఇస్తాయని రైతులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని రైతులందరూ సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యం ఇవ్వాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ కోరారు. రసాయన ఎరువులను ఎక్కువగా ఉపయోగించడంతో దశలవారీగా పొలంలో భూసారం తగ్గిపోయి పంటపొలాలకు తెగుళ్ల బెడద మరింత ఎక్కువై క్రమేపీ దిగుబడి తక్కువగా వస్తుందన్నారు. రైతులు వారి పశువుల శాలల్లో ఏడాది పొడవునా నిల్వచేసి ఉంచిన పశువుల పేడ, చీకినగడ్డి మంచి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని దీనిని పొలాల్లో వేయడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయన్నారు. భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా దోహదపడతాయని, సేంద్రియ ఎరువులు వాడిన పంటపొలాల్లో చీడపీడలు, తెగుళ్ల తక్కువగా ఉంటాయన్నారు. పూడికమట్టి, పశువుల పేడల్లో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం పోషక విలువలు లభించడంతో పైర్లు పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని త్వరలో పంటదమ్ములు చేయనున్న తరుణంలో రైతులందరూ సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.


ఖర్చు తగ్గుతుంది



సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల సేద్యంలో ఖర్చులు తగ్గుతున్నాయి. పంటదమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలంలో వేసి కలియదున్నడంతో భూసారం పెరిగి పంట సమయంలో యూరియా వంటి ఎరువుల వినియోగం అంతగా అవసరం ఉండటం లేదు.

– నల్లమిల్లి అచ్చిరెడ్డి, రైతు, మొగలిపాలెం

డిమాండ్ పెరిగింది



ఇటీవల పశువుల పెంపకం తక్కువగా ఉండటంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరిగింది. దీంతో రెండేళ్లకోసారి పొలంలో సేంద్రియ ఎరువులు వేస్తున్నాం. దీనివల్ల దిగుబడితో పాటు పంటలో నాణ్యత పెరిగింది.

– సువ్వారి గోవిందు, రైతు తర్లంపూడి